క్లుప్తంగా

మామిడి రైతు విలవిల



అకాల వర్షానికి నేలరాలిన మామిడికాయలను చూపుతున్న రైతు

ఉయ్యాలవాడ : ఇటీవల కురిసిన అకాల వర్షం , ఈదురు గాలులతో కాకరవాడ గ్రామ సమీపంలో 1.68 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతింది. చంటిరాముడు అనే కౌలు రైతు ఎకరాకు రూ.30 వేలు కౌలు చెల్లించి పంట సాగు చేశాడు. పంటకు పెట్టుబడుల రూపంలో రూ.1.20 లక్షలు ఖర్చు చేశాడు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రతి సంవత్సరం పంట చేతికి అందే సమయంలో చెట్టుకు ఉన్న కాయలు రాలి నష్టాలు చవి చూస్తున్నట్లు బాధిత రైతు వాపోయాడు. ఉద్యానవన శాఖ అధికారిణి ధరిణిని వివరణ కోరగా వడగళ్ల వానకు దెబ్బతిన్న మామిడి తోటను పరిశీలించామని, రైతు వివరాల మేరకు ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు ఆమె తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డుపై గ్రావెల్ తోలుతున్న ట్రాక్టర్

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నె వద్ద నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఎర్రగుడిదిన్నె నుంచి జాతీయ రహదారి మధ్యనున్న ఆర్అండ్బీ రోడ్డుపై గతంలో సీసీరోడ్డు ఉండేది. అయితే వాహనాల రాకపోకలతో ఆ రోడ్డు దెబ్బతినడంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. అవస్థలు గుర్తించిన ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జాతీయ రహదారి నుంచి 400 మీటర్ల పొడవున నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.80లక్షలు మంజూరు చేయించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఎమ్మెల్సీ ఎన్నిలకు ముందే పనులు చేపట్టి దెబ్బతిన్న సీసీ రోడ్డును తొలగించారు. ఇంతలో ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో పనులు నిలిపేశారు. ప్రస్తుతం కోడ్ ముగియడంతో సోమవారం పనులను పునః ప్రారంభించారు. గ్రావెల్ తోలించి చదును చేసి నూతన సీసీ రోడ్డు వేయిస్తామని ఆర్అండ్బీ ఏఈ శేఖర్ తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

రుద్రవరం: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరగతితో పాటు 7,8 తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈ నెల 27వ తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ లక్ష్మీదేవి సోమవారం తెలిపారు. సీట్ల భర్తీకి సంబంధించి అనుసంచరించాల్సిన విధి విధానాలను ప్రభుత్వం విడుదల చేసిందని, ఆసక్తి గల వారు ఆన్లైన్లో దరఖస్తులు చేసుకోవచ్చని చెప్పారు.

25లోపు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నంద్యాల(రూరల్): ఈనెల 25వ తేదీలోపు జిల్లాలోని వినియోగదారులు తమ నెలవారి విద్యుత్ పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏపీ ఎస్పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డి సోమవారం కోరారు. స్థానిక కార్యాలయంలో పెండింగ్ విద్యుత్ బిల్లులపై జిల్లాలోని ఏడీఏలు, ఏఈల తో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించని గృహాలకు ఈనెల 26వ తేదీ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని స్పష్టం చేశారు. అలాగే జిల్లాలోని వివిధ చిన్న, పెద్ద పరిశ్రమలు నిర్వాహకులు తమ పెండింగ్ బిల్లులను చెల్లించాలని చెప్పారు.

'బార్' ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న సీనియర్ న్యాయవాది సూర్యనారాయణరెడ్డి

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ ఎన్నికల కు సంబంధించినామినేషన్ల ప్రక్రియ మొదలైంది. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఎన్నికల కార్యాలయంలో సోమవారం నామినేషన్లు వేశారు. అధ్యక్షుడిగా సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నరసింహారెడ్డి, జనరల్ సెక్రటరీగా అంబాటి గోపాల్రెడ్డి, ట్రెజరర్ గా నేరేళ్ల మురళీమోహన్ తదితరలు నామినేషన్లు దాఖలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నీలకంఠం, పిఎస్ మహ బూబ్బాషా ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

నంద్యాల(అర్బన్): ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నంద్యాల డివిజన్ కార్యదర్శి శంకర్ కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల అరటి, మిరప, మొక్కజొన్నతో పాటు ఉద్యానవన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కోతకు వచ్చిన పంటలు నేలరాలడంతో రైతులు భారీగా నష్టపోయారన్నారు. నాయకులు రఫీ, మహమ్మద్, ఖాజామియా పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలకు వేళాయే..



బోయలకుంట్లలో పూర్తయిన గ్రామ సచివాలయ భవనం

శిరివెళ్ల: మండలంలో పూర్తయిన వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. ఈ మేరకు ఆయా గ్రామాల్లో సర్పంచులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం పనులు, మురుగు కాల్వలు, గ్రామ సచివాలయ భవనాలు, అంతర్గత సిమెంట్ రోడ్లను ప్రారంభించనున్నారు. మహాదేవపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల వినతి మేరకు రూ.20 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణాలు, రూ.42 లక్షలతో బోయలకుంట్లలో పూర్తయిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారు. అలాగే యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో రూ.12 లక్షలతో వేసిన అంతర్గత సిమెంట్ రోడ్డు, జీనేపల్లెలో రూ.5లక్షలతో వేసిన సీసీరోడ్డు, రూ.4 లక్షలతో పూర్తి చేసిన మురుగు కాల్వ , గుంప్రమాన్దిన్నె మజరా గ్రామం గాంధీనగరంలో రూ. 68 లక్షలతో వేసిన అప్రోచ్ బీటీ రోడ్డును ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి ప్రారంభించనున్నారు.ఇందుకు మండలంలో ఈ నెల 26,27 తేదీల్లో ఎమ్మెల్యే పర్యటించనున్నారు.



మహదేవపురంలో శిలాఫలకం ఏర్పాటు చేస్తున్న దృశ్యం



యర్రగుంట్లలో సిమెంట్ రోడ్డు వేసిన దృశ్యం



జీనేపల్లెలో సీసీ రోడ్డు పూర్తి చేసిన దృశ్యం

టీటీడీ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

నంద్యాల(వ్యవసాయం): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్బీఐ కాలనీ రామాలయంలో ఉగాదిని పురస్కరించుకొని పంచాంగ శ్రవణం ఏర్పాటు చేస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖా నిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, రామాలయం కమిటీ అధ్యక్షుడు సుధాకర్రెడ్డి తెలిపారు. సోమవారం దేవాలయ ఆవరణలో కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడు తూ ఉగాది పండుగ రోజు సాయంత్రం 6గంటలకు భార్గవరామ శర్మ పంచాంగ పఠనం చేస్తారని చెప్పారు. 23 నుంచి 29వ తేదీ వరకు దీవీ హయగ్రీవాచార్యులతో శ్రీమద్రామాయణ సప్తాహ ప్రవచన యజ్ఞానాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. చంద్రశేఖర్రెడ్డి, సుబ్బన్న, శంకర్నాయక్, రాముడు, మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అలాగే.. సంజీవనగర్లోని కోదండ రామాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని వేదపండితులు యాదవల్లి కార్తికేయశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు భగవత్ సేవా సమాజ్ సభ్యులు సోమవారం తెలిపారు. అదే విధంగా వసంత నవరాత్రుల మహోత్సవాలను ఈనెల 22వ తేదీ నుండి 31వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం స్వామి అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, సాయంత్రం ఊంజల సేవ కార్యక్రమాలు ఉంటాయని, 30న సీతారాముల కల్యాణం ఉంటుందని చెప్పారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



ఉయ్యాలవాడలో ప్రజలకు చట్టాల పై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది

ఉయ్యాలవాడ : ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, జాయింట్ సెక్రటరీ ఓబులేస్ తెలిపారు. సోమవారం రాత్రి ఉయ్యాలవాడలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు మాట్లాడుతూ ట్రాక్టర్ వాహనాలకు బీమా సౌకర్యం, డ్రైవర్కు లైసెన్స్, ద్విచక్ర వాహనంపై కేవలం ఒక్కరు లేక ఇద్దరు మాత్రమే ప్రయాణం చేయాలని సూచించారు. గృహ హింస కేసులు, వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు జీవనభృతిలో భాగంగా భరణం, తదితర చట్టాలపై న్యాయవాదులు తిరుపతయ్య, నరసింహుడు, శ్రీనివాసులు, రాజశేఖర్, నాగశేషు, ఇంద్రకుమార్ అవగాహన కల్పించారు. ఎస్ఐ సత్యనారాయణ, సర్పంచ్ మేకల ఓబులేస్, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ బుద్ధా చంద్రమోహన్రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని నంద్యాల జిల్లా పీఈటీ సంఘం నాయకులు సోమవారం కార్యాలయంలో సన్మానించారు. ఏపీ స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దండె నాగరాజు మాట్లాడుతూ పీఈటీల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. రమణారెడ్డి, వెంకటస్వామి, రవీంద్రుడు, గోపినాయక్, మారెళ్ల నాగరాజు, భరత్కుమార్ పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం కంబగిరయ్య

● రేపు సుద్దమల్లలో తిరునాల





ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం, ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి

ఉయ్యాలవాడ : కోర్కెలు నెరవేర్చి భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్నాడు సుద్దమల్ల గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి వారు. ఉగాది సందర్భంగా ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా వేడుకలు నిర్వహించడానికి ఆలయాన్ని నిర్వాహకులు ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి చంద్రుడు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పట్టణ ప్రాంతాల నుంచి ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. పండుగ రోజు సంప్రదాయం ప్రకారం ఆలయ ప్రాగణంలో శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, లక్ష్మీదేవికి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు సుద్దమల్ల, అల్లూరు, ఉయ్యాలవాడ గ్రామాల నుంచి తేరుబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. స్వామి దర్శించుకోవడం వల్ల పాపాలు హరించబడతాయని, కోరిక కోర్కెలు నెరవేరతాయని ఇక్కడి భక్తుల విశ్వాసం.

ఎద్దుల బండలాగుడు పోటీలు

గోస్పాడు: ఉగాది పండుగ పురస్కరించుకొని మండలంలోని దీబగుంట్ల, సాంబవరం గ్రామాల్లో రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి ఆధ్వర్యంలో దీబగుంట్లలో శ్రీగుమ్మిత మల్లికార్జునస్వామి, వీరభద్రస్వామి తిరునాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 25న సీనియర్ విభాగం, 26న న్యూకేటగిరీ, పాలపండ్ల సైజు విభాగం, 27న ఆరుపండ్ల లోపు, పాలపండ్ల విభాగంలో ఎద్దుల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. అలాగే సాంబవరంలో శ్రీ అంకాలమ్మ తిరునాల నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 23న నాలుగు పండ్ల సైజు ఎద్దుల పోటీలు, 24న న్యూకేటగిరీ విభాగంలో పోటీలు, ఈనెల 25న పాలపండ్ల విభాగంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వీటితో పాటు ఇసుక బస్తా, గుండు ఎత్తే పందెం, ఆటో రివర్స్, ట్రాక్టర్ రివర్స్, బైక్, సైకిల్ స్లో పోటీలు ఉంటాయని చెప్పారు.

స్త్రీనిధి బకాయిలు రూ. 9 కోట్లు



ఆన్లైన్లో వివరాలు పరిశీలిస్తున్న నాగప్రసాద్

ఉయ్యాలవాడ : నంద్యాల జిల్లాలోని 29 మండలాల్లో స్త్రీ నిధి ద్వారా పొదుపు మహిళలు తీసుకున్న రుణాలు రూ.9 కోట్లు బకాయి ఉన్నాయని, ఈ నెలాఖరుకు రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్త్రీ నిధి జిల్లా మేనేజర్ నాగప్రసాద్ తెలిపారు. సోమవారం స్థాని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయాన్ని సందర్శించారు. ఆన్లైన్లో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో స్త్రీ నిధి ద్వారా రూ.150 కోట్లు నిర్ణీత లక్ష్యం కాగా ఇప్పటి వరకు పొదుపు నిర్వహణలో లావాదేవీలు సక్రమంగా నిర్వహిస్తున్న గ్రూపుల్లోని 28,500 మంది మహిళలకు రూ.136 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరం అందజేశామని చెప్పారు. ఉయ్యాలవాడ కార్యాలయ పరిధిలో రూ. 31.15 లక్షలు రికవరీ చేయవలసి ఉందన్నారు. అనంతరం వీఓఏల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలకు అందించే స్త్రీ నిధి, ఉన్నతి, వైఎస్సార్ ఆసరా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయితే సమావేశానికి ఆర్.జంబులదిన్నె, కాకరవాడ, అల్లూరు, మాయలూరు, ఆర్.పాంపల్లె, హరివరం, సుద్దమల్ల గ్రామాలకు చెందిన వీఓఏలు గైర్హాజరవడంపై ఏపీఎం శేఖర్, సీసీ గంగన్న పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గైర్హాజరైన వీఓఏలపై చర్యల నిమిత్తం జిల్లా పీడీకి నివేదికలు పంపనున్నట్లు మేనేజర్ వెల్లడించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల ఏరియా కోఆర్డినేటర్ గురుస్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

ఆళ్లగడ్డ: రూరల్ మండలం శాంతినగరం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మురబ్బీ (65) అనే వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. బాచిపల్లె గ్రామానికి చెందిన మురబ్బీ మండల కేంద్రం శిరివెళ్లకు చెందిన బంధువు మృతి చెందడంతో చివరి చూపునకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో తన అల్లుడు ఓబులంపల్లె గ్రామానికి చెందిన ఉశేన్బాషా మోటార్సైకిల్పై బయలు దేరారు. ఈ క్రమంలో శాంతినగరం సమీపంలోకి వచ్చేసరికి మోటార్సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో మురబ్బీ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన ఉశేన్బాషాను 108 వాహనంలో స్థానిక వైద్యశాలకు తీసుకెళ్లగా అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజశేఖర్రెడ్డి తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

నంద్యాల(అర్బన్): ఇటీవల పిడుగు పడి మృతి చెందిన గొర్రెల కాపరి ఆంజనేయులు కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. ఆంజనేయులు కుటుంబాన్ని సోమవారం సంఘం నాయకులు, డీవైఎఫ్ఐ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈనెల 16న శిరివెళ్ల చెరువు వద్ద పిడుగు పడి గొర్రెల కాపరి ఆంజనేయులు మృతి చెందగా శంకర్, విశ్వనాథ్, సాయికుమార్, మద్దిలేటి, సుభాన్ తీవ్ర గాయాలపాలై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని, ప్రభుత్వం ఆ కుటుంబానికి ఎక్స్గ్రేషియాతో ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

23న జిల్లా స్థాయి పొట్టేళ్ల పోటీలు

మిడుతూరు: మండలపరిధిలోని పైపాలం గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని 23వ తేది గురువారం 8 గంటలకు జిల్లా స్థాయి పొట్టేళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలైన పొట్టేళ్ల యజమానులకు మొదటి, రెండో, మూడో బహుమతులు వరుసగా రూ. 10, 000, రూ. 6000, రూ. 4000 నగదును అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆసక్తి కల వారు రూ. 300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 90003 75654, 95504 94675, 96668 76505 సెల్ఫోన్లో సంప్రదించాలన్నారు.

నంద్యాల నుంచి శ్రీశైలానికి బస్సులు

మహానంది: ఉగాది మహోత్సవాల సందర్భంగా నంద్యాల నుంచి శ్రీశైలం, మహానందికి 30 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు నంద్యాల డిపో చీఫ్ ఇన్స్పెక్టర్ మద్దిలేటినాయుడు తెలిపారు. ఉగాది ఉత్సవాల సందర్భంగా మహానందిలో ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం ఆయన ఎస్టీఐ వెంకటేశ్వర్లు, అస్లాంబాషాలతో కలిసి వచ్చారు. ఆయన మాట్లాడుతూ మహానంది నుంచి రాయచూరుకు పది బస్సులు ఉంటాయన్నారు. అవసరమైతే బళ్లారికి సైతం బస్సులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కన్నడ భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్ పాయింట్ ఏర్పాటు చేసి కన్నడ బాషలో భక్తులకు అర్థమయ్యేలా వివరిస్తూ ఉంటామని వివరించారు.

అధికారులకు కలెక్టర్ అభినందన



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సాఫీగా నిర్వహించి విజయవంతం చేశారని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను అభినందించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాల్లో స్పందన కార్యక్రమానికి ముందు జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించి విజయవంతం చేసిన అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. జాయింట్ కలెక్టర్ మొదలుకొని కింది స్థాయి ఉద్యోగి వరకు ఎన్నికలకు సంబంధించి అప్పగించిన పనులను బాధ్యతాయుతంగా నిర్వహించి ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పూర్తి చేశారన్నారు. పోలింగ్ నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లు పోలింగ్ సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి సాఫీ ఎన్నికల ప్రక్రియకు తోడ్పాటనందించారన్నారు. కౌంటింగ్ సమయంలో కూడా నంద్యాల జిల్లాకు సంబంధించి అన్ని ఫారమ్స్ టాలీ అయ్యాయని చెప్పారు. భవిష్యత్లో జరిగే ఎన్నికలను కూడా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.

జాతీయ హ్యాండ్బాల్ పోటీలకు ఎంపిక



ఎస్.నరేష్



డి.దస్తగిరి

నంద్యాల(సిటీ): జాతీయ స్థాయి సబ్జూనియర్ హ్యాండ్బాల్ పోటీలకు నంద్యాల జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా హ్యాండ్బాల్ సంఘం ప్రతినిధులు మహబూబ్బాషా, రామేశ్వర రెడ్డి, రాజకుమార్రెడ్డి సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ జనవరి 13, 14వ తేదీల్లో కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్బాల్ పోటీల్లో నంద్యాల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ చూపిన క్రీడాకారులు ఎస్.నరేష్, డీ. దస్తగిరి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వీరు రాష్ట్ర జట్టు తరుపున ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు అస్సాంలోని గౌహతిలో జరిగే సబ్ జూనియర్ బాలుర జాతీయ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్షావలిని అభినందించారు.

సూక్ష్మశైలిలో ఈ-క్రాఫ్ట్ కళ



కోటేష్ వేసిన సూక్ష్మ చిత్రం

నంద్యాల(అర్బన్): ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్, అతి చిన్న మైక్రో క్రాఫ్ట్ కళను ప్రదర్శించారు. సెంటీమీటర్ కన్న తక్కువ 0.6ఎంఎం సైజులో బంకమట్టితో భూమి, మూడు చెట్లు, చేయి చూపుతూ అతి చిన్న సైజులో ఐదు బొమ్మలను ఏడు నిమిషాల వ్యవధిలో మొదటి సారిగా సూక్ష్మశైలిలో రూపొందించారు. ప్రతి ఒక్కరూ చెట్లను సంరక్షించాలని వినూత్న రీతిలో బొమ్మ వేశానని కోటేష్ తెలిపారు.

ఉగాది ఏర్పాట్ల పరిశీలన



సౌకర్యాలపై భక్తులతో ఆరా తీస్తున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం చేసిన వివిధ ఏర్పాట్లను సోమవారం ఈఓ ఎస్ లవన్న పరిశీలించారు. ఇందులో భాగంగా యాంపిథియేటర్, మల్లమ్మ కన్నీరు, పలు ఉద్యాన వనాలు, పార్కింగ్ ప్రదేశాలు, దేవస్థానం ఏర్పాటు చేసిన సమాచార కేంద్రాన్ని సందర్శించారు. ఈఓ మాట్లాడుతూ క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, శివదీక్షా శిబిరాలు, అన్నదాన ప్రదేశాలలో సుమారు 3 లక్షల వాటర్ప్యాకెట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. మరో 2 లక్షల మంచి నీటి ప్యాకెట్లను కూడా సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. క్షేత్ర పరిధిలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు దేవస్థానం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుండాలని సూచించారు. దేవస్థానం అందిస్తున్న సౌకర్యాలపై పలువురు భక్తుల అభిప్రాయాలను ఈఓ తెలుసుకున్నారు. ఉగాది మహోత్సవాలకు వచ్చిన కన్నడ భక్తుల సౌకర్యార్థం సిద్ధరామప్ప వాణిజ్య సముదాయం, మల్లమ్మ కన్నీరు, వైద్యశాల, కల్యాణకట్ట, పాతాళగంగ మెట్ల వద్ద తదితర పది చోట్ల సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఈఓ వివరించారు.

పెండింగ్ టీఏ చెల్లించాలి

దొర్నిపాడు: ఐదేళ్లుగా పెండింగ్ ఉన్న టీఏను వెంటనే చెల్లించాలని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు సోమవారం కోరారు. తమ డిమాండ్ల సాధనకు విజయవాడ వెళ్తున్న కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ జయప్రసాద్కు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ పదవీ విరమణ కింద రూ.5 లక్షలు, చిన్న అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చాలని కోరారు. విధుల్లో ఉండి చనిపోతే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అగంన్వాడీ కార్యకర్తలు మంజుల, రమాదేవి, మహాలక్ష్మి, లక్ష్మీదేవి, ఫాతిమా, ఓళమ్మ పాల్గొన్నారు.

● చలివేంద్రం సరే.. దారేదీ?

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మున్సిపల్ అధికారులు చలివేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈనెల 15వ తేదీన సాక్షి దినపత్రికలో 'కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు' అనే శీర్షికకు కలెక్టర్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజా ప్రయోజనాల నిమిత్తం కార్యాలయాలను ప్రజలు సందర్శించే సమయంలో వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. అయితే అధికారులు చలివేంద్రం ఏర్పాటు చేసినా దాని నిర్వహణను గాలికొదిలేశారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి సిబ్బందిని నియమించకపోవడం గమనార్హం. అలాగే పక్కనే ఉన్న జ్యూస్ బండి నిర్వాహకులు బండిని చలివేంద్రంలోకి పెట్టి వ్యాపారం చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు.



చలివేంద్రానికి దారి లేకుండా పండ్ల రసాల బండిని అడ్డంగా ఉంచిన దృశ్యం